క్లుప్తంగా

కిండర్ గార్టెన్ డే



భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కిండర్ గార్టెన్ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కరణ్, డైరెక్టర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటర్ సంగీత ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు వాహన వేలం

మహదేవపూర్: మండల కేంద్రంలో ఇటీవల గుడుంబా తరలిస్తూ పట్టుబడిన పల్సర్ బైక్‌ను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సుపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నేడు(గురువారం) వేలం వేయనున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనవొచ్చని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహాముత్తారం: మండలకేంద్రంలో బుధవారం మహాముత్తారం హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో భాగంగా యువకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే యువత గుట్కా, మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు ఉన్నారు.

హైకోర్టు ఏజీపీగా రేలా కృష్ణస్వామి



మొగుళ్లపల్లి: తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా మండలంలోని పర్లపలి గ్రామానికి రేలా కృష్ణస్వామి నియమితులైనారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేలా కృష్ణస్వామి ఉన్నత చదువులు చదివి రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా 2015లో పేరు నమోదు చేసుకుని గత ఏడు సంవత్సరాలుగా తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. అతడి నియమకంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై బుధవారం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని తొలిగించారు. ఎనిమిది మంది అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి వెంట కారోబార్ దోమల శ్రీనివాస్, సిబ్బంది బ్రహ్మం, అర్జున్ ఉన్నారు.

జయంతిని నిర్వహించాలి

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మండల, గ్రామ అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పరామర్శ

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి గ్రామానికి చెందిన పిలుమర్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బుధవారం గోమాసే సచిన్ యువసేన సభ్యులు, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. అనంతరం బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రూబిన్‌నాయక్, తాటిపల్లి రాజబాపు, సచిన్ యువసేన సభ్యులు తదితరులు ఉన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



చిట్యాల: నైన్‌పాకలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్



కాటారం: ఆదర్శ హై స్కూల్‌లో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చిట్యాల: మండలంలోని పలు పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చల్లగరిగ రైజింగ్‌సన్, జూకల్ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కాకతీయ హైస్కూల్, నైన్‌పాక ఉన్నత పాఠశాలలో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, ప్రధానోపాధ్యాయులు ఆకుల రమేష్, కృష్ణ, పింగిలి విజయపాల్‌రెడ్డి, కుసుమ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎండి రాజ్‌మహ్మద్, ఊర్మిళ, సరళ పాల్గొన్నారు.

కాటారం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌తో పాటు జెడ్పీహెచ్ పాఠశాల, కేజీబీవీలో బుధవారం సైన్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదర్శ హై స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో–2024 ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ప్రదర్శించిన నూతన ఆవిష్కరణలు, సైన్స్ ఎగ్జిబిట్స్, సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపర్చాయి. ఈ కార్యక్రమాల్లో ఆదర్శ హై స్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, కేజీబీవి ప్రత్యేకాధికారిణి చల్ల సునీత, ఆదర్శ కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, డైరెక్టర్ కృష్ణచైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సరిత డిగ్రీ కళాశాల అధ్యాపకులు రమేష్, రాజేందర్, రాజు, రజిత, శ్రీనివాస్, మున్నయ్య, రవీందర్, మడ్క మధు, దిలిప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని మండలంలో తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాల, కొయ్యూరు విశ్వదీప్తి, దేవి విద్యోదయ తదితర పాఠశాలల్లో బుధవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు పలు వైజ్ఞానిక ప్రదర్శనలు చేసి చూపించారు. అలాగే డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్‌రావు, సైన్స్ టీచర్లు కుమారస్వామి, శ్రీనివాస్, విశ్వదీప్తి పాఠశాల ప్రిన్స్‌పాల్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు మండలంలోని మడతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు తయారుచేసిన 23 ఆర్టికల్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూరం లక్ష్మీ మాట్లాడుతూ.. సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్‌ఎఫెక్ట్ ఆవిష్కరించిన సందర్భంగా అదే రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, వనిత, మహేందర్, రాజు, సంజీవరావు, అరవింద, యాసిన్, రియాజ్, రామ్మోహన్, అంకం శ్రీనివాస్, పీఈటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయా పాఠశాలలో డ్రాయింగ్, క్విజ్ కాంపిటీషన్స్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. కుమారస్వామి, విజయపాల్ రెడ్డి , ఉపాధ్యాయులు సదానందం, వీరయ్య, ఉమారాణి, లలిత, కళ్యాణి, విజిత పాల్గొన్నారు.



మొట్లపల్లిలో..



మొగుళ్లపల్లిలో..



రేగొండలో..



మల్హర్: బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న హార్థిక్

భూపాలపల్లి అర్బన్: శ్రీనివాస రామనుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఐఐటీ, మెడికల్ ఒలంపియాడ్ పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంగ్ సురేష్, ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. మ్యాథమెటిక్స్ విభాగంలో మైనాల హార్థిక్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్, ముస్కాన్ ఫాతిమ, మైనాల నిత్య పిల్లి ప్రవస్తి, పసునుటి మనోజ్ఞలు ప్రత్యేక బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణంలో విద్యార్థును అభినందించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న వాహనం

టేకుమట్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన చింతల అర్జున్ మండలంలోని రామకిష్టాపూర్(వి)లో గ్రామస్తుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి టాటాఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలించడం నేరమన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సంఘం నాయకులు

కాటారం: యువతను సన్మార్గంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీని సంఘం నాయకులతో కలిసి డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహనీయుల జీవిత ఘట్టాలతో పాటు సమాజాన్ని చైతన్య పరిచే విధంగా ఫోక్సో చట్టం, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధి, అత్యాచారాల నిరోధక చట్టం, కేసులు, సెక్షన్లు, అట్రాసిటీ చట్టం వివరాలు, రాజ్యాంగంలోని ముఖ్యమైన ఆర్టికల్స్ డైరీలో పొందుపర్చడం అభినందనీయం అన్నారు. ఇలాంటి డైరీలు వినియోగించడం వల్ల చట్టాలపైన ప్రజలు అవగాహన కలిగి నేర ప్రవృత్తికి దూరంగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, సుధాకర్, రజనీకాంత్, తిరుపతి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

మహాముత్తారం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామ ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో ముఖ్యంగా నీటి సమస్యపై ప్రణళిక సిద్ధం చేసుకొని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లోని గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనుల్లో కూలీలు 50 మందికి తగ్గకుండా చూసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌కు నేడు(గురువారం)వస్తున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రకు కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రభారి వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, దేశ భద్రత, పేదరిక నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు వివరిస్తారని తెలిపారు. అనంతరం భూపాలపల్లి నుంచి రేగొండ మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. రేగొండలో కార్నర్ మీటింగ్ అనంతరం యాత్ర పరకాలకు చేరుకుంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య, కన్నం యుగేందర్, లింగంపల్లి ప్రసాద్ రావు, నాయకులు బట్టురవి, దొంగల రాజేందర్, మధుసూదన్‌రెడ్డి, మండల రఘునాథ్‌రెడ్డి, మాచినేని రవీందర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి



రేగొండ: మాట్లాడుతున్న హిమబిందు

రేగొండ: మండలంలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి హిమబిందు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 3 నుంచి 5 వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ రజాక్, ఎంఈఓ వేల్పుల ప్రభాకర్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్ రావు నాయకులు పున్నం రవి, రవిసామ్రాట్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం కోసం బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమవేశంలో కాళేశ్వరం పాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మిత మాట్లాడుతూ.. 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరి పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ రామారావు, డాక్టర్ విజయ్ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



ట్రాక్టర్ల వద్ద సీఐ వేణుచందర్, సిబ్బంది

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి శివారు మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ వేణుచందర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 9 ట్రాక్టర్లు, 2 లారీలను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు బానోత్ వీరు, పట్టెం కోటి, గుగులోతు సమ్మయ్య, గంజి రజినీకాంత్, సాద రాజు, దేవ సతీష్, బందేల శివ, బందేల నర్సయ్య, శివకుమార్, బండి శ్రీనివాస్, బండ శ్రీకాంత్, బందెల రమేష్, పేరుమాండ్ల క్రాంతిలతో పాటు ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట సెకండ్ ఎస్సై ఎండీ శాఖాన్, పోలీస్ సిబ్బంది నవీన్, ప్రశాంత్, లింగన్న తదితరులు ఉన్నారు.

ఆపన్నహస్తం అందించండి!

- రోడ్డు ప్రమాదంలో నిరుపేద యువకుడికి తలకు గాయాలు
- చికిత్సకు రూ.3లక్షలు అవసరం
- శ్రీనాథ్‌ను బతికించుకోవడానికి తల్లిదండ్రుల తపన

దీన గాథ



చికిత్స పొందుతున్న శ్రీనాథ్

గణపురం: గణపురం మండలంలోని చెల్పూరు గ్రామానికి చెందిన ఎంజాల శ్రీనాథ్ (బన్నీ) అనే యువకుడికి సోమవారం భూపాలపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమయింది. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్కానింగ్ చేసిన అక్కడ వైద్యులు శ్రీనాథ్‌కు మెదడులో రక్తం గడ్డకట్టిందని ఆపరేషన్ చేయడానికి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనాథ్ తల్లిదండ్రులు ఎంజాల నాగమణి, దేవేందర్ కుమారుడిని బతికించుకోవడానికి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దాతల నుంచి ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకుంటున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరువ తీసుకొని ప్రభుత్వం నుంచి చికిత్స చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనాథ్ కుటుంబాన్ని ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి బుధవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరతి పోషన్న, రాజు, సంపత్ పాల్గొన్నారు.

ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్ - 99126 38755

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

రేగొండ: మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా లక్ష్మిప్రియ, ఎంఈఓగా రిషిత, ప్రధానోపాధ్యాయులుగా రాజేందర్, ఉప ఉపాధ్యాయులుగా సురేష్‌తో పాటు సుమారుగా 30 మంది విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వు రజిన్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రాజు, రవీందర్, భిక్షపతి, శోభన్, సుమన్, దేవేందర్, ఐలయ్య, మాలత, చైతన్య, రాధిక, ఉజ్వల, శిరోమణి పాల్గొన్నారు.

కొత్తపల్లిగోరిలో నగదు చోరీ



బీరువా తాళం పగులగొట్టిన దొంగలు

రేగొండ(కొత్తపల్లిగోరి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మండల కేంద్రానికి చెందిన షరీఫ్ ఇంట్లో చోరీకి పాల్పడి లక్ష యాభై వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ... మేడారం జాతర నేపథ్యంలో నెల రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి వ్యాపార రీత్యా జాతరకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని లక్ష యాభై వేల రూపాయలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



చిట్యాల: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



కాటారం: ఆలస్యం కావడంతో పరిగెడుతున్న విద్యార్థిని

కాటారం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజులో భాగంగా కాటారం మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 180 మందికి గాను 172 మంది హాజరు కాగా, గిరిజన బాలుర గురుకుల కళాశాల కేంద్రంలో 175 మందికి 170 మంది, గంగారం మోడల్ కళాశాల పరీక్షా కేంద్రంలో 180 మందికి 174 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రిన్సిపల్స్ నరేందర్, బుచ్చయ్య, మధు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలను ఫ్లెయింగ్ స్క్వాడ్ శరతృతి, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ పరిశీలించి పరీక్ష కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేసి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 321 గాను 312 మంది హాజరు కాగా 9 మంది గైహాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కరుణీజీ తెలిపారు. అలాగే మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 300 మంది విదార్థులకు గాను 286 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏలాంటి ఘర్షణ చోటు చేసుకోకుండా ఎస్సై ఎండీ శాఖన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సర వార్షిక పరిక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఫ్లెయింగ్ స్క్వాడ్ శరతృతి తనిఖీ చేశారు. తెలుగు, సంస్కృతం పరీక్షకు 103 మంది విద్యార్థులకు 96 మంది హాజరు కాగా ఒకేషనల్ పరీక్షకు 38 మంది విద్యార్థులకు 34 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వ్యాసం సరిత తెలిపారు.

ఇసుక డంపు సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని ఆరెపల్లి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను బుధవారం సీజ్ చేసినట్లు ఆర్ఐ సంతోష్ తెలిపారు. ఈ మేరకు వివరాలను వెల్లడించారు. మండలంలోని కుందనపల్లి, గుమ్మడవెల్లి శివారు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ ఆరెపల్లి శివారులో నిల్వ చేస్తున్నారనే సమాచారంతో ఉదయం తనిఖీ చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో సుమారు 15 ట్రాక్టర్ల ఇసుక నిల్వను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భిక్షపతి, సురేష్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410